''లేచాను. ఆనందంతో నాహృదయం పులకరిస్తోంది. దానివంక చూశాను, రాముడు ఇంకా తీసుకెళ్ళాడో, లేదో అని. ఇంకా లేదు. నిద్రపోతోంది. లేపాను కాని, ఒక పట్టున లేస్తుందా జమురాలు, మందమతి! వూపుంచగా, వూపుంచగా మూలిగి, బాధపడి, విసుక్కుని, కళ్ళుతెరిచి పిచ్చిగా చూసింది.

" 'రాముడికి శలవయింది ప్రయాణం కట్టు' అన్నాను. పొయ్యే ప్రాణి! ముందే చెప్పి వుంచితే మంచిది. రాముడి వుద్దేశ్యం కూడా అదే అయివుంటుంది. జీవనమంతా దానికి యజమానినైన నేను, యీ తుది సహాయం మాత్రం చెయ్యవొద్దా! దాని చూపు చూస్తే నావంటి భ కధీరుడికి. కూడా కళ్ళంబడి నీళ్ళు తిరిగాయి.

"ఇంకా ఇహ లోకవాసనలు వొదల్లేదు.

"ఏం ప్రయాణం?'' అంది వొణుకుతో.

"నాకు యేడుపు వొచ్చింది. కాని యెందరు భార్యలు పోవడం లేదు? విచార పడడం ధీరుడి లక్షణమా అని ధైర్యం చెప్పుకుని "పరలోకానికి. రామాజ్ఞ అయింది. నువ్వేమీ భయపడకు. యమదూతలు వొస్తున్నారు. సరిగా చూడు కనపడుతూనే వుంటారు యీపాటికి- పెద్ద కోరలూ, యెర్ర కళ్లూ, భయంకరమైన....'' అని చెప్తున్నాను.

''అబ్బో అని పెద్ద కేక వేసింది

"ఫరవాలేదు. నిప్పులు కక్కే పీలపు దున్నపోతు మీద నెక్కిన నల్లనివాడు కాలయముడు........''

మళ్ళీ పెద్దగా అరిచింది పిచ్చిది.

" ' నీకేం భయంలేదు. దిగులూ లేదు. రాము డున్నాడు. నేనేమి లోపం జరగనీను నీకు. పొద్దునే చెందనపు చక్కలూ, కర్పూరమూ తెప్పించి వలక్షణంగా దహనం చేయించి ఘనంగా కర్మ చేస్తాను. నా చేతి మీదుగా దాటిపోవడం కన్న నీ కేం అదృష్టం కావాలి!'

" 'నాకు జబ్బునయంగా వుంది. అదేమిటి అట్లా అంటారు?' అంది వెర్రిది.

"చివరి నిమషాల్లో అట్లానే వుంటుంది లే."

"అది చూడండి. ఇన్నేళ్లు నా భార్యయై వుండికూడా కొంచెం వైరాగ్యమన్నా లేకుండా, కాపీనపు గుడ్డేసుకొని, జావవంక చూస్తోంది, ఇంకా తాగాలనే! ఈ సంగతి తెలిస్తే రామ భక్తుడికి యెంత అపకీర్తి! నీ భార్యకు చెప్పుకోలేని వైరాగ్యం మాకు చెప్ప వచ్చావా? నీకు భిక్ష దక్షిణా కూడానా? అంటారు.

"ఆ రోజు వంటలు లేవుకదా! భజనకు ప్రాణం వుండవొద్దా అనీ, దాని మనస్సుని యిహ వాసనలనుంచి తప్పించాలనీ, అది చూస్తూ వుండగానే ఆ జావ నేనే తాగేసి, రామభజన తాళాలతో సహా దాని చెవులో బిగ్గరగా ప్రారంభించేప్పటికి, పావుగంటలో దాని ప్రాణం కడగంటింది. గుడ్లు తెలేసింది. ధైర్యంగా ఈ చెవులోంచి ఆ చెవులో కితారక నామం అరుస్తూనేవున్నాను. దాని తల్లీ వాళ్లూ యీడ వాలని గొంతులు సవరించుకొని శ్రుతులుచూచుకొంటున్నారు. వీల్లేద న్నాను. అది సమయం కాదన్నాను. యేశ్వరా తంతానన్నాను. కళ్ళు తెరిచి కొడుకును చూపించమంది. 'పోయ్యే దానివి నీకెందుకు? నా భార్యవై ఉండి ఇంకా కొడుకూ మొగుడూ అని యీ లోకాన్ని పట్టుకు యేడిస్తే యెంత అపకీర్తి! పో-పో, రాముడే నీ కొడుకు, రాముడే నీ తండ్రి. పో, త్వరగా పో' అన్నాను. కాని కడపటి వూపిరితో "అబ్బాయి, మాధవుడు!" అంది.

"'ఒసే, ఇంకా పోవేమే! నీకేం తక్కువయింది? సుఖంగా పది యేళ్లు కాపరం చేశావు, చీరలు కట్టావు, నగలు పెట్టావు. భక్తాగ్రేసరుడు నీ భర్త, తన భక్తితో నీకు మోక్షమార్గం కలిపించి కైవల్యానికి సరాసరి పంపుతూ వుంటే ఇంకా సంకోచిస్తావు, ఓసి పాడు పీనుగా!' అని ధిక్కరించాను. దాంతో ఆశలన్నీ వొదిలి, కళ్లు మూసింది. అప్పుడు చెవులో, 'రాముడు కనపడితే నా సంగతి జ్ఞాపకం చెయ్యి. సీతమ్మ తల్లికి నా నమస్కారాలు చెప్పు. కలియుగంలో ధర్మాత్ములు తక్కువైనారను' అన్నాను.

"దాని ప్రాణం పోగానే నా వంటికి కూడా ప్రేమ బంధం తప్పింది కాదు. అంత డబ్బునీ, దాని నగలతోసహా నేను దానం

